సాక్షి
ములుగు

ఆదివారం | 13 | ఆగస్టు | 2023



ప్రయాణికులకు గుడ్‌న్యూస్..

ఆర్టీసీ బస్సుల్లో జీపీఎస్ ట్రాకింగ్ సిస్టంను ఏర్పాటు చేశారు. 'గమ్యం' యాప్‌తో బస్సు ఎక్కడుందో తెలుసుకోవచ్చు.

- 8లో ▸



బాలుడి ప్రాణం తీసిన నిద్ర

అనారోగ్యంతో బాధపడుతున్న నానమ్మను చూసేందుకు తల్లిదండ్రులతో కలిసి ఆటోలో వెళ్తున్న ఓ బాలుడు ఆటోలోంచి పడి మృతిచెందాడు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం

$32^0/25^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉండి సాయంత్రం చల్లగా మారుతుంది.

న్యూస్‌రీల్

వరద బాధితులకు జడ్జి చేయూత



వెంకటాపురం(ఎం): మండల పరిధిలోని బూర్గుపేటలో గల వరద బాధిత కుటుంబాలను జిల్లా జడ్జి డి.రమామోహన్‌రెడ్డి శనివారం పరామర్శించి చేయూతను అందించారు. ఈ సందర్భంగా జడ్జి గ్రామంలో పర్యటించి గ్రామస్తుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని వరద బాధిత కుటుంబాలతో పాటు 50 మంది గ్రామస్తులకు బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్జి వెంట ఎస్సై తాజొద్దీన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లకు రివార్డు

ములుగు: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వచ్చిన వరదల్లో చిక్కుకున్న వారిని చాకచక్యంగా సాహసం చేసి కాపాడిన కానిస్టేబుళ్లు శ్రీకాంత్, రాంబాబుకు ప్రభుత్వం తరఫున ప్రత్యేక రివార్డు అందించనున్నారు. జిల్లా విపత్తు ప్రతిస్పందన బృందంలో పనిచేస్తున్న ఇరువురికి ఎస్పీ గాష్ ఆలం శనివారం అభినందనలు తెలిపారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్ చేతుల నుంచి రివార్డు అందుకోనున్నట్లు తెలిపారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డు



మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల విద్యార్థి తెలుగు బుక్ ఆఫ్ రికార్డు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు. 5వ తరగతి చదువుతున్న బాసాని అక్షయ్ తేజ్ శనివారం గురుకుల పాఠశాల ప్రాంగణంలో పీరియాడికల్ టేబుల్, ప్రపంచ దేశాల రాజధానులు, వాటి కరెన్సీ గురించి చెప్పి తెలుగు బుక్ ఆఫ్ రికార్డు ఘనత సాధించాడు. ఈ కార్యక్రమానికి పాఠశాలల ఉమ్మడి వరంగల్ ప్రాంతీయ సమన్వయ అధికారి మనోహర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రతిభ ఎవరి సొత్తు కాదని.. చదివితే ఎవరైనా ఉన్నత శిఖరాలు చేరవచ్చని విద్యార్థిని అభినందించారు. ప్రిన్సిపాల్ అలుబోజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి వ్యక్తిలో ప్రతిభ దాగి ఉంటుందని.. దానికి సరైన సాధన, పట్టుదల, కృషి చేసినప్పుడే ఫలితం వస్తుందన్నారు. అనంతరం విద్యార్థిని, అతడి తల్లిదండ్రులను అభినందించి మెమొంటో శాలువాతో సన్మానించారు. రికార్డు సాధించిన అక్షయ్ తేజ్‌ను ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ జూరీ మెంబర్ అశోక్, రఘు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్ర ప్రదర్శనలు

భూపాలపల్లి అర్బన్: భారత స్వాతంత్య్ర వజ్రోత్సవాల ముగింపు ఉత్సవాల్లో భాగంగా రేపటి నుంచి 24వ తేదీ వరకు గాంధీ చిత్ర ప్రదర్శనలు చూపించనున్నట్లు భూపాలపల్లి కలెక్టర్ భవేష్‌మిశ్రా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వజ్రోత్సవాల ప్రారంభ సమయంలో కూడా విద్యార్థులలో జాతీయ స్ఫూర్తిని పెంపొందించే విధంగా గాంధీ చిత్రాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ఉచితంగా ప్రదర్శించనున్నట్లు తెలిపారు. రేపు ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు చిత్ర ప్రదర్శన ఉంటుందని చెప్పారు. 15వ తేదీన స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా, 20వ తేదీన ఆదివారం కారణంగా చిత్ర ప్రదర్శన ఉండదని తెలిపారు. 16వ తేదీ నుంచి 24 ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు వరకు చిత్ర ప్రదర్శన ఉంటుందని తెలిపారు. థియేటర్ల నిర్వాహకులు, విద్యాశాఖ, రవాణాశాఖ, పోలీసుశాఖ, సమాచార శాఖ అధికారులు సమన్వయంతో ఆటంకాలు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

గ్రంథ పాలకుల దినోత్సవం

భూపాలపల్లి అర్బన్: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక గ్రంథాలయంలో గ్రంథ పాలకుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారతీయ గణిత శాస్త్రజ్ఞుడు, గ్రంథాలయాధికారి ఎస్ఆర్ రంగనాథన్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్ పూలమాల వేశారు. గ్రంథాలయోద్యమంలోని ప్రముఖుల్లో ఒకరు రంగనాథన్‌గా రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకులు శారద, శ్రీనివాస్, సిబ్బంది రాకేష్ పాల్గొన్నారు.

సర్వే షురూ..

- 'గృహలక్ష్మి'కి 26,332మంది దరఖాస్తులు
- అర్హులను తేల్చే పనిలో నిమగ్నమైన అధికారులు

ఏటూరునాగారం: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టి దరఖాస్తులను ఆహ్వానించింది. పథకం కింద ఇంటి నిర్మాణానికి రూ.3లక్షల ఆర్థిక సాయం చేయనున్నట్లు ప్రకటించింది. దీంతో దరఖాస్తులు భారీగా వచ్చాయి. ఈ క్రమంలో గ్రామ పంచాయతీల వారీగా అధికారులు సర్వేను శనివారం నుంచి చేపట్టారు. అర్హులను తేల్చే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లా వ్యాప్తంగా 26,332 మంది గృహలక్ష్మి పథకానికి మహిళలు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు సమయంలో ఫారంతో కులం, నివాసం, ఆదాయంతో పాటు ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ తదితర ధ్రువీకరణ పత్రాలను జతపర్చాలని ప్రభుత్వం కోరింది. కొంత మంది అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేయగా మరికొంత మంది సర్వేకు వచ్చినప్పుడు చూపిస్తామని వాటిని తయారు చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

ఇందిరమ్మ లబ్ధిదారుడికి నో చాన్స్

గతంలో ఇందిరమ్మ ఇళ్లు వచ్చిన లబ్ధిదారులకు గృహలక్ష్మి పథకాన్ని వర్తింప చేసే అవకాశం లేకుండా పోయింది. దీంతో అర్హులైన వారి నుంచి అధికారులు దరఖాస్తులు తీసుకున్నారు.

నారీమణులకే..

గృహలక్ష్మి పథకం గృహిణిలకు ఇవ్వడానికే ప్రభుత్వం గృహలక్ష్మి పథకంగా నామకరణం చేసింది. సొంత స్థలం ఉండి ఇళ్లు లేని వారు ఈ పథకానికి అర్హులు. అంతే కాకుండా వరదల్లో కూలిపోయిన, కొట్టుకపోయిన వంటి ఇళ్లను కూడా గుర్తించి ఈ పథకాన్ని వర్తింప చేయనున్నారు.

క్షేత్రస్థాయి పరిశీలన

ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను పరిశీలించి నేరుగా క్షేత్రస్థాయిలోకి రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు సంయుక్తంగా సర్వేలను శనివారం నుంచి చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 9 మండలాల్లో 174 గ్రామ పంచాయతీల్లో దరఖాస్తుదారుల ఇంటికెళ్లి అర్హులా కాదా తేల్చనున్నారు. ఇందుకోసం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, కార్యదర్శులు, రెవెన్యూ, ఎంపీడీఓ తదితర శాఖల అధికారులు సర్వే పనుల్లో నిమగ్నమయ్యారు.



ఏటూరునాగారంలో గృహలక్ష్మి దరఖాస్తులపై సర్వే చేస్తున్న పీఆర్ ఏఈఈ భిక్షపతి



ఫొటోలో ఉన్న మహిళ పేరు జనగాం రాధ. ఏటూరునాగారం మండల కేంద్రంలోని 6వ వార్డులో నివాసం ఉంటుంది. పెంకుటిల్లుపై బరకాలు కట్టుకొని భర్త, పిల్లలతో ఈ కుంగిపోయిన ఇంటిలోనే జీవనం సాగిస్తున్నారు. గత ఏడాది వరదలు వచ్చినప్పుడు గోడలు కూలిపోయి ఇల్లు కుంగిపోయి ఉంది. ఇంటి చుట్టూ పరదాలు కట్టుకొని కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం వీరిది. అధికారులు ఇలాంటి వారిని గుర్తించి ఇళ్లు మంజూరు చేయాలని నిరుపేద ప్రజలు కోరుతున్నారు.

మండలాల వారీగా దరఖాస్తుల వివరాలు..

మండలం	వచ్చిన దరఖాస్తులు
ములుగు	4,006
వెంకటాపురం(ఎం)	2,937
గోవిందరావుపేట	2,922
ఎస్ఎస్‌తాడ్వాయి	2,327
ఏటూరునాగారం	2,718
మంగపేట	3,478
కన్నాయిగూడెం	1,230
వెంకటాపురం(కె)	3,682
వాజేడు	3,032

దరఖాస్తు గడువు పెంచాలి..



గృహలక్ష్మి పథకానికి దరకాస్తు చేసుకునేందుకు గడువు పెంచాలి. దరఖాస్తులు చేసుకునే గడువు తక్కువగా ఇవ్వడంతో చాలా మంది దరఖాస్తులు చేసుకోలేదు. దాని వల్ల ఇల్లు కోల్పోయే అవకాశం ఉంది. దరఖాస్తు గడువు పెంచి అర్హులను ఎంపిక చేయాలి.

- ఇర్సవడ్ల సమ్మక్క, ఏటూరునాగారం

మేరా మిట్టి.. మేరా దేశ్



మొక్కలతో ఎస్సై, కమాండెంట్ తదితరులు



మొక్కలు నాటుతున్న ఎస్సై, కమాండెంట్

ఏటూరునాగారం: ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని బీ 39 సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ మేరా మిట్టి, మేరీ దేశ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా 50 మొక్కలను సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ వృశాలి హోట్లె, ఎస్సై కృష్ణప్రసాద్‌లు నాటారు. మొక్కల పెంపకంతో కలిగే ప్రయోజనాలు వివరించారు. అనంతరం మట్టిని సేకరించారు. ఈ కార్యక్రమంలో రెండో ఎస్సై రామకృష్ణ, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగం చేయలేం.. బదిలీ చేయండి?

మంగపేట: మండల పరిధిలోని 14 గ్రామ పంచాయతీలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు తాము ఇక్కడ విధులు నిర్వహించలేమని తమను వేరే చోటకు బదిలీ చేయాలని వేడుకుంటూ జిల్లా అధికారులకు లిఖిత పూర్వకంగా వినతిపత్రాన్ని అందజేసినట్లు తెలిసింది. మండల పరిధిలోని 2011 నుంచి స్థానిక సంస్థల ఎన్నికలు జరుగకపోవడంతో గ్రామ పంచాయతీలకు సర్పంచులు లేక 12 ఏళ్లుగా ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో పరిపాలన కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో అవినీతి అక్రమాలు జరిగాయని, కొందరు పంచాయతీ అధికారులు లక్షల రూపాయల నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు కొద్ది రోజుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. దీంతో పాటు పలువురు పంచాయతీ కార్యదర్శులపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఇటీవల జిల్లా ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్, డీఆర్‌డీఓ నాగద్మజ, డీఎల్‌పీఓ నాగపురి స్వరూపారాణి రోపణలు వచ్చిన పంచాయతీ కార్యదర్శులకు సంబంధించిన ఆయా పంచాయతీల నిర్వహణ రికార్డులను పరిశీలించారు. మూడేళ్ల నుంచి ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూ చాలీచాలని వేతనాలతో ఉద్యోగం చేస్తున్న తమకు రెగ్యులర్ అయ్యే క్రమంలో కావాలని పని కట్టుకుని కొందరు తమపై అసత్య ఆరోపణలు చేయడం, తమ పై అధికారులు సహకారం తమకు లేక పోవడంతో ఎలాంటి తప్పు చేయక పోయినా తమపై వస్తున్న ఆరోపణలతో తాము మానసిక వేదనతో విధులు నిర్వహించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు లేని ఇక్కడ తాము విధులు నిర్వహించలేమని తమను జిల్లాల్లో ప్రజా ప్రతినిధులు ఉన్న ఏదైనా మండలానికి బదిలీ చేయాలని వేడుకుంటున్నట్లుగా సమాచారం. ఈ విషయంపై డీపీఓ వెంకయ్యను వివరణ అడుగగా రెండు రోజుల క్రితం కొందరు పంచాయతీ కార్యదర్శులు జిల్లా ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్, డీఆర్‌డీఓ నాగద్మజకు కలిసి వారి అభిప్రాయాన్ని తెలిపిందే వాసవం ఇంటికి వెళంది. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు పోయామని వివరించారు.

జాతీయ జెండాను ఆవిష్కరించనున్న ప్రభుత్వ విప్

ములుగు: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించనున్న జెండా పండుగ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఎంఎస్ ప్రభాకర్‌రావును నియమిస్తూ సీఎస్ శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు జాతీయ జెండాను ప్రభుత్వ విప్ ఆవిష్కరించనున్నారు.



పర్యాటకుల సందడి

వాజేడు: మండల పరిధిలోని చీకుపల్లి గ్రామ సమీపంలో ఉన్న బొగత జలపాతం వద్ద శనివారం పర్యాటకుల సందడి నెలకొంది. బొగత జలపాతం అందాలను చూసేందుకు వచ్చిన పర్యాటకులు నీటి కొలనులో స్నానాలు చేశారు. సెల్ఫీలు దిగుతూ ఆనందంగా గడిపారు.

వరదలతో భారీ నష్టం

- ఎన్పీడీసీఎల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మోహన్‌రెడ్డి

ఎస్ఎస్‌తాడ్వాయి/ములుగు రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వచ్చిన వరదలతో విద్యుత్ శాఖకు భారీ నష్టం వాటిల్లిందని ఎన్పీడీసీఎల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మోహన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మేడారంలో అధికారులతో కలిసి ఆయన శనివారం పర్యటించారు. జంపన్నవాగు వరదలకు దెబ్బతిన్న విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, 33 కేవీ, 11 కేవీ ఫీడర్ స్తంభాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్తూరు సబ్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ గోవిందరావుపేట మండలంలోని 1,200 విద్యుత్ స్తంభాలు, 50 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడంతో రూ. 2కోట్ల నష్టం వాటిల్లిందని తెలిపారు. మేడారంలో 656 స్తంభాలు, 85 ట్రాన్స్‌ఫార్మర్లు, వెంకటపూరం మండల పరిధిలో 120 పోల్స్, 18 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయని తెలిపారు. జిల్లాలో మొత్తం 2,166 స్తంభాలు, 216 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిని నష్టం వాటిల్లినట్లు తెలిపారు. వరదలో మేడారం, కర్లపల్లి 33 కేవీ విద్యుత్ లైన్ దెబ్బతిని విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు. వరదలు తగ్గిన తర్వాత 24 గంటల్లో జిల్లాలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల పనులను పనుల పర్యవేక్షణకు అధికారులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండి పనులను చేయిస్తున్నారన్నారు. వరదలకు దెబ్బతిన్న పస్రాలోని సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. ఆయన వెంట సీజీఎం బికాంసింగ్, కన్‌స్ట్రక్షన్ సీఈ కమల్, కన్‌స్ట్రక్షన్ డీఈ హరిప్రసాద్, సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

బీసీ బంధు ప్రకటించాలి

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి

భూపాలపల్లి రూరల్: బీసీలందరికీ బీసీ బంధు ప్రకటించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి డిమాండ్ చేశారు. బీసీలందరికీ రూ.10లక్షల బీసీ బంధు ఇవ్వాలని శనివారం భూపాలపల్లి పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దొంగల రాజేందర్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన దీక్ష చేపట్టారు. దీక్షకు ముఖ్య అతిథిగా కీర్తిరెడ్డి హాజరై మాట్లాడారు. బీసీ బంధు అంటే రూ.10 లక్షలు ఇస్తారని బీసీలు అంతా ఎదురు చూస్తుంటే కేవలం రూ.లక్షతో రాష్ట్ర ప్రభుత్వం బీసీలను మోసంచేసిందన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీసీ కార్పొరేషన్ రుణాలు ఇవ్వకుండా బీసీ యువత పట్ల చిన్నచూపు చూస్తూ ఆర్థికంగా దెబ్బతీసిందన్నారు. తొమ్మిది సంవత్సరాల పరిపాలనలో బీసీలకు అన్యాయం చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి బీసీలంతా ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే రోజుల్లో బీసీలకు భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కన్నం యుగంధర్, అర్బన్ అధ్యక్షుడు సామల మధుసూదన్‌రెడ్డి, బట్టు రవి, కంబాల రాజయ్య, మాచనివేని రవీందర్, మందల రఘునాద్‌రెడ్డి, అజ్మీర రాజ్‌నాయక్, వేషాల సత్యవతి, సూర మహిపాల్, నాంపల్లి కుమార్, చెక్క శంకర్, కంచెం నరసింహమూర్తి, గంగాధరి సమ్మయ్య, హరీశ్ పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న కీర్తిరెడ్డి

సీపీఎస్‌ను రద్దు చేయాలి

భూపాలపల్లి అర్బన్: సీపీఎస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీఎస్) రాష్ట్ర స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు సంవత్సరాల తరబడి పరిష్కరించకపోవడంతో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరిస్తామని చెప్పి ఇప్పటి వరకు అమలుచేయడం లేదన్నారు. ఏళ్ల తర బడి ప్రమోషన్లు, బదిలీలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. కోర్టుల్లో ఉన్న వివాదాన్ని పరిష్కరించి ప్రమోషన్లు బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా శిబిరానికి కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తిరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి సాయిలు, యూఎస్‌పీసీ నాయకులు రఘుకుమార్, రాజమల్లయ్య, రఘుపతిరెడ్డి, రమణారెడ్డి, సేవానాయక్, రమేష్, తిరుపతి పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

గొర్లవీడులో పల్లెనిద్ర



గొర్లవీడులో పల్లెనిద్ర చేస్తున్న సత్యనారాయణరావు, కార్యకర్తలు

భూపాలపల్లి రూరల్: కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు శనివారం భూపాలపల్లి మండలం గొర్లవీడు గ్రామంలో పల్లెనిద్ర చేశారు. దెబ్బట శ్రీనివాసాచార్యులు ఇంటి వద్ద సహపంక్తి భోజనం చేశారు. గ్రామంలో పలువురి ఇళ్లకు వెళ్లి సమస్యలు తెలుసుకుని పార్టీ నాయకులతో కలిసి నిద్ర చేశారు. అంతకుముందు ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏ ఒక్క వర్గమూ సంతోషంగా లేదన్నారు. ఎన్నికల ముందు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్‌కు వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామచంద్రయ్య, ధరణి రమణాచారి, రామినేని రవీందర్, నలిమెల సదయ్య పాల్గొన్నారు.

విద్యుత్ పనులను పునరుద్ధరిస్తాం

చిట్యాల: చిట్యాల సబ్ డివిజన్ కింద ఉన్న మండలా విద్యుత్ పనులను పునరుద్ధరిస్తామని ప్రాజెక్టు డైరెక్టర్ మోహన్‌రెడ్డి తెలిపారు. సబ్‌స్టేషన్ ఆవరణలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యుత్ శాఖకు భారీ వర్షాల మూలంగా నష్టం వాటిల్లిందని తెలిపారు.

నకిలీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్

- పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

హసన్‌పర్తి: నకిలీ డాక్యుమెంట్లతో కొందరు వ్యక్తులు తన భూమిని రిజిస్ట్రేషన్ చేశారని బాధితురాలు వైజయంతి తెలిపింది. ఈ మేరకు శనివారం హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. హన్మకొండ అడ్వకేట్ కాలనీకి చెందిన జగతిరావు 1986లో ఏనుగుల సుజాత బాయి, పావుశెట్టి ఆగయ్య వద్ద ఎనిమిది వందల గజాల భూమిని కొనుగోలు చేశారు. ఆ భూమిని జగతిరావు తన కూతురు వైజయంతి పేర సేల్ డీడ్ చేశాడు. ఇందులో నుంచి నాలుగు వందల గజాల భూమిని వైజయంతి తన సోదరి రామవరపు లక్ష్మి పేర రిజిస్ట్రేషన్ చేసింది. ఈ ఎనిమిది వందల గజాల భూమిని భీమారానికి చెందిన భాగ్యరాజ్ నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసి విక్రయించారని వైజయంతి తెలిపింది. ఇందుకు కె.సత్యం, రాజేశ్వర్‌శర్మతో మరో ఇద్దరు సహకరించారని ఆమె వివరించింది. ఇందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని వైజయంతి కోరింది. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గోపీ తెలిపారు.

ప్రైవేట్ బ్యాంకులో ఘరానా మోసం..

- ఫండ్స్‌ను దారిమళ్లించిన డిప్యూటీ మేనేజర్
- అదుపులోకి తీసుకున్న పోలీసులు.. కేసు నమోదు

నర్సంపేట రూరల్ : ప్రైవేట్ బ్యాంకు డిప్యూటీ మేనేజర్ ఘరానా మోసం చేసి ఫండ్స్‌ను పక్కదారి పట్టించారు. ఈ ఘటన నర్సంపేట పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ప్రధాన రహదారిపై ఓ ప్రైవేట్ బ్యాంకు కొనసాగుతోంది. ఇక్కడ డిప్యూటీ మేనేజర్ తన వక్రబుద్ధి ప్రదర్శించారు. బ్యాంకు ఫండ్స్ దారి మళ్లించారు. తప్పుడు డ్యాక్‌మెంట్స్ సృష్టించి లోన్స్ ఇచ్చినట్లు రికార్డులు తారుమారు చేశారు. దీనిపై ఉన్నతాధికారులకు అనుమానం వచ్చి పరిశీలించగా, రికార్డులు, నగదు, బంగారం తదితర అంశాల్లో పూర్తిగా వ్యత్యాసం కనిపించింది. డిప్యూటీ మేనేజర్‌పై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో పోలీసులు డిప్యూటీ మేనేజర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయన ఇంట్లో సోదాలు నిర్వహించి విలువైన పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. కాగా, ఈ ఘనటపై ఎస్సై రవిని వివరణ కోరగా బ్యాంక్‌లో జరిగిన అవకతవకలపై సంబంధిత ఉన్నతాధికారులు ఫిర్యాదు చేయగా డిప్యూటీ మేనేజర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

'క్యాసినో' కోసం కన్నం..

- ఆన్‌లైన్ గేమ్‌లో డబ్బు పోగొట్టుకున్న విద్యార్థి
- ఎలాగైనా సంపాదించాలని చోరీకి నిర్ణయం
- ఐనవోలు, బొల్లికుంటలో దొంగతనాలు
- విద్యార్థితోపాటు స్నేహితుడి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఈస్ట్‌జోన్ డీసీపీ


మామునూరు : నిందితుల అరెస్ట్ చూపుతున్న డీసీపీ రవీందర్ యాదవ్, ఏసీపీ సతీష్‌బాబు

మామునూరు: ఓ విద్యార్థి ఆన్‌లైన్ గేమ్ 'క్యాసినో'కు అలవాటు పడ్డాడు. ఆ గేమ్‌లో భారీగా నగదు పోగొట్టుకున్నాడు. చేసిన అప్పు తీర్చాలి. పోయిన డబ్బు ఎలాగైనా సంపాదించాలనుకున్నాడు. దీనికి చోరీలే మార్గమనుకున్నాడు. ఇంకేముందు తాళం వేసిన ఇళ్లకు కన్నం వేయడం మొదలుపెట్టాడు. చోరీ చేసిన డబ్బుతో ఆన్‌లైన్ గేమ్ ఆడుతూ జల్సాలు చేస్తున్నాడు. ఇలా చోరీలకు పాల్పడుతున్న ఓ విద్యార్థితోపాటు అతడికి సహకరించిన స్నేహితుడు శనివారం ఐనవోలు పోలీసుల చేతికి చిక్కగా వారి వద్ద నుంచి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు శనివారం సాయంత్రం మామునూరు ఏసీపీ కార్యాలయంలో వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ యాదవ్ వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం దమ్మన్నపేటకు చెందిన విద్యార్థి టెల్లి సందీప్ ఆన్‌లైన్ గేమ్ 'క్యాసినో'కు అలవాటు పడ్డాడు. ఈ గేమ్ కోసం అప్పు చేశారు. అనంతరం ఆడగా డబ్బు మొత్తం పోగొట్టుకున్నాడు. దీంతో అప్పు తీర్చేందుకు చోరీలు చేయాలని నిశ్చయించుకున్నాడు. తాళం వేసిన ఇళ్లల్లో చోరీలు చేయడం మొదలెట్టాడు. ఈ క్రమంలో గతనెల 23న ఐనవోలు మండల కేంద్రంలో పల్లకొండ రాజేష్ ఇంట్లో చోరీకి పాల్పడి రూ.80వేల నగదు, బంగారం, వెండి ఆభరణాలను అపహరించాడు. చోరీ చేసిన డబ్బు నుంచి రూ.60 వేలతో ఓ బైక్, రూ.30వేలతో ఫోన్ కొనుగోలు చేశాడు. అనంతరం జూలై 24న ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట గ్రామంలో అడ్డ గట్ల ఎల్లయ్య ఇంట్లోకి చోరీకి పాల్పడ్డాడు. రూ.2వేల నగదుతోపాటు 2తులాల బంగారం,వెండి ఆభరణాలు అపహరించాడు. చోరీ చేసిన నగదు నుంచి రూ.2వేలు ఖర్చు చేశాడు. అనంతరం చోరీ చేసిన బంగారు, వెండి ఆభరణాలను తన స్నేహితుడు జనగామ జిల్లా పెద్దపహాడ్ గ్రామానికి చెందిన భూక్య సంపత్ వద్ద భద్రపర్చాడు. ఈ క్రమంలో శని వారం ఐనవోలు మండలం పున్నేలు గ్రామంలో వాహన తనిఖీలు చేస్తున్న ఎస్సై నవీన్‌కుమార్.. అనుమానాస్పందగా కనిపించిన సందీప్‌ను అదుపులోకి తీసుకున్నాడు. విచారించగా చోరీలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్న సందీప్.. ఆ డబ్బును తన స్నేహితుడు భూక్య సంపత్ వద్ద దాచిన పెట్టినట్లు తెలిపాడు. దీంతో సందీప్‌తోపాటు సంపత్‌ను అరెస్ట్ చేసి వారి వద్ద ఉన్న బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ తెలిపారు. తల్లిదండ్రులకు తమ పిల్లలపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని మొబైల్ గేమ్స్ ఆడకుండా చూడాలని డీసీపీ సూచించారు. సమావేశంలో మామునూరు ఏసీపీ సతీష్ బాబు, మామునూరు, వర్ధన్నపేట సీఐలు క్రాంతికుమార్, శ్రీనివాస్, ఎస్సైలు కృష్ణవేణి, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల దొంగల అరెస్టు..

వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో బైక్‌లు, తాళం వేసి ఉన్న షట్టర్లల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను సీసీఎస్, మట్టెవాడ, సుబేదారి పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేసినట్లు క్రైం ఏసీపీ మల్లయ్య శనివారం తెలిపారు. నిందితుల నుంచి సుమారు రూ.6లక్షల విలువైన తొమ్మిది బైక్‌లు, రూ.1.60 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. వరంగల్ పోచమ్మమైదాన్ చెందిన బరిపట్ల సాయి వరంగల్ కమిషనరేట్‌తోపాటు మహబూబాబాద్ జిల్లాలో చోరీలకు పాల్పతుండగా పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు. గత జూన్‌లో జైలు నుంచి విడుదలైన సాయి మరోమారు చోరీలకు పాల్పడుతుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఘటనలో హనుమకొండ దీన్ దయాల్ కాలనీ చెందిన బూకరాజు సందీప్ వరంగల్ కమిషనరేట్ పరిధితో పాటు కరీంనగర్, ఖమ్మం ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలు చోరీలకు పాల్పడుతుండగా పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు. గత మే నెలలో ఖమ్మం జైలు నుంచి విడుదలైన సందీప్ మరోమారు వరంగల్ ,హైదరాబాద్‌లో తాళం వెసిన షట్టర్లు, ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడ్డాడు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు పక్కా సమాచారంతో నిందితులను పట్టుకున్నారు. వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వీరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారించగా తమ నేరాలను అంగీకరించారు. వీరి సమాచారంలో మిగతా ద్విచక్రవాహనాలు, నగదుతో పాటు ఇతర చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు క్రైమ్ ఏసీపీ తెలిపారు.


వరంగల్ క్రైం: నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


సింగరి రవి (ఫైల్)

టేకుమట్ల(రేగొండ): అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కోటంచలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కోటంచ గ్రామానికి చెందిన సింగరి రవి(48) తనకున్న రెండెకరాల భూమిలో వివిధ పంటలను సాగు చేసుకుంటున్నాడు. గత సంవత్సరం పంటలు పండకపోవడంతో పాటు, ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. గతంలో చేసిన సుమారు రూ.5లక్షల మేర అప్పులు ఎలా తీర్చాలన్న బాధతో తీవ్ర మనస్తాపానికి గురై ఈ నెల 10న తెలవారుజామున ఇంట్లోని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం చిట్యాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు తెలిపారు. కాగా మృతుడి కుమారుడు రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

16న ఎస్‌వీఎస్‌లో ప్లేస్‌మెంట్

హసన్‌పర్తి: భీమారంలోని ఎస్‌వీఎస్ ఇంజనీరింగ్ కళాశాలో ఈనెల 16న ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు తెలిపారు. క్యాప్ జెమిని, డిలైట్, ఏడీపీ, జేపీ మార్గోన్ కంపెనీలను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఇంజనీరింగ్, ఏదైనా డిగ్రీలో 50శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు అర్హులన్నారు. 2020-2021, 2021-2022 2022- 2023 విద్యాసంవత్సరాల్లో డిగ్రీ చదివిన వారు ప్లేస్‌మెంట్‌కు హాజరుకావాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 16వ తేదీ ఉదయం 9 గంటల లోపు ఒరిజినల్ సర్టిఫికెట్లతో రావాలన్నారు. ఉద్యోగానికి ఎంపికైన వారికి ఏడాదికి రూ.3 నుంచి రూ.8లక్షల వరకు వేతనం ఉంటుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం


పిచ్చయ్య (ఫైల్)

దేవరుప్పుల : జనగామ-సూర్యాపేట రహదారిపై కామారెడ్డిగూడెం స్టేజీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు దుర్మరణం చెందాడు. మండలంలోని కామారెడ్డిగూడేనికి చెందిన మరిపెల్లి పిచ్చయ్య (70) శనివారం ఉదయం అంబేద్కర్ విగ్రహం నుంచి షేక్‌బందగీ స్తూపం వైపునకు రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో జనగామ నుంచి సూర్యాపేట వైపునకు వెళ్తున్న టాటా ఏస్ వాహనం ఢీకొనగా తీవ్రగాయాలపాలయ్యాడు. వెంటనే చికిత్స నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.శ్రవణ్‌కుమార్ పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న రైతు మృతి

కాటారం: భారీ వర్షాలు, అన్నారం బ్యారేజీ బ్యాక్ వాటర్‌తో పంట నీట మునగడంతో అప్పుల పాలై ఆత్మహత్యకు యత్నించిన ఓ రైతు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం మండలం దామెరకుంటకు చెందిన అడుగూరి విశ్వనాథం(50) తనకు ఉన్న రెండెకరాల భూమితో పాటు ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేస్తున్నాడు. గతేడాది పంట సాగు కోసం రూ.5లక్షల మేర అప్పు చేశాడు. భారీ వర్షాలతో అన్నారం బ్యారేజీ బ్యాక్ వాటర్ రావడంతో పంట పూర్తిగా నీటమునిగి నష్టపోయాడు. ఈ ఏడాది కూడా అదే భూమిలో వరి సాగు చేశారు. పెట్టుబడి కోసం రూ.1.50లక్షలు అప్పు చేశాడు. బ్యాక్ వాటర్‌తో పంట మొత్తం నీట మునిగి నష్టం వాటిల్లింది. దీంతో రూ.6.50 లక్షల మేర అప్పు అయింది. అప్పు తీర్చే మార్గం లేకపోవడంతో గురువారం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య శంకరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు.

ఉసురు తీసిన ఇసుక లారీ..

- బైక్‌ను ఢీకొన్న వాహనం
- అక్కడికక్కడే యువకుడి మృతి
- వెలిశాలలో ఘటన


కుమారస్వామి (ఫైల్)

టేకుమట్ల: ఇసుక లారీ ఓ యువకుడి ఉసురు తీసింది. ఈ ఘటన శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాలలో జరిగింది. గ్రామానికి చెందిన ఊర కుమారస్వామి(30) తన ద్విచక్ర వాహనంపై పంగిడిపల్లి వైపునకు వస్తున్నాడు. ఈ క్రమంలో బూర్నపల్లి ఇసుక క్వారీకి వెళ్తున్న లారీ.. వెలిశాల హైలెవల్ కల్వర్టుపై ఎదురుగా ఢీకొంది. దీంతో కుమారస్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గట్ల సుధాకర్ తెలిపారు. కాగా, పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ మృతుడి బంధువులు రోడ్డుపై ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు కాంగ్రెస్, బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం లేదన్నారు. ఫలితంగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. మృతుడి కుటుంబానికి పరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజక వర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణ, బీజేపీ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు. చిట్యాల సీఐ వేణుచందర్, టేకుమట్ల, చిట్యాల, రేగొండ ఎస్సైలు సుధాకర్, షాఖాన్, శ్రీకాంత్‌రెడ్డి బందోబస్తు నిర్వహించారు.

ఎస్సైల దాతృత్వం..

మృతుడు కుమారస్వామి కుటుంబానికి చిట్యాల సీఐ వేణుచందర్, టేకుమట్ల, రేగొండ ఎస్సైలు సుధాకర్, శ్రీకాంత్‌రెడ్డి రూ.10వేల చొప్పున అందించి తమ దాతృత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

బాలుడిని బలితీసుకున్న నిద్ర..

- నానమ్మను చూసేందుకు వెళ్తూ అనంతలోకాలకు...
- కునుకు తీస్తూ ఆటో నుంచి జారి పడి చిన్నారి మృతి
- జనగామలో ఘటన


ఆస్పత్రి ఆవరణలో రోదిస్తున్న బాలుడి తల్లి, కుటుంబ సభ్యులు


షరీఫ్ (ఫైల్)

జనగామ : అనారోగ్యంతో బాధపడుతున్న నానమ్మను చూసేందుకు తల్లిదండ్రులతో కలిసి ఆటోలో వెళ్తున్న ఓ బాలుడిని మృత్యువు.. నిద్ర రూపంలో కబలించింది. ఈ ఘటన శనివారం జిల్లా కేంద్రంలో జరిగింది. పాలకుర్తి మండలం మల్లంపల్లికి చెందిన ఇమామ్ పాషా, భార్య కర్మిషా బతుకుదెరువు నిమిత్తం ఘట్‌కేసర్‌కు వెళ్లారు. అక్కడే పాషా ఆటో నడిపించుకుంటూ.. కుమారుడు షరీఫ్(8), ఇద్దరు కూతుళ్లను పోషించుకుంటున్నాడు. రెండో శనివారం స్కూల్ లేకపోవడంతో తన తల్లి అనారోగ్యంగా ఉండడంతో భార్య, బిడ్డలతో కలిసి పాషా సొంత ఆటోలో బయలుదేరాడు. జనగామ పట్టణంలోని క్లాం కమాన్ వద్దకు రాగానే.. ముందు సీటులో ఉన్న బాలుడు షరీఫ్ కునుకు తీయడంతో ఆటో నుంచి కిందపడ్డాడు. తీవ్రగాయాలతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అటుగా వెళ్తున్న ఓ కారు ప్రయాణికులు.. బాబును వెంటనే జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. తీసుకొచ్చిన అరగంట లోపే బాలుడు మృతి చెందాడు.

రోదనలతో మిన్నంటిన ఆస్పత్రి..

బాలుడి మృతితో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగారు. బాధితుల రోదనలతో ఆస్పత్రి ప్రాంగణం మిన్నంటింది. బాలుడు షరీఫ్ మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించగానే.. తల్లిదండ్రులు అక్కడే కుప్పకూలిపోయారు. మృతుడి ఇద్దరు చెల్లెళ్లు.. అన్నా మాట్లాడు అంటూ విగత జీవిగా ఉన్న తమ సోదరుడిని తట్టి లేపుతుంటే అక్కడే ఉన్న పేషెంట్లు, వైద్యులు కన్నీరు కార్చారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రయాణికులకు గుడ్‌న్యూస్..

- ఆర్టీసీ బస్సుల్లో జీపీఎస్ ట్రాకింగ్ ఏర్పాటు..
- ప్రారంభించిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్


హనుమకొండ బస్ స్టేషన్‌లో 'గమ్యం' యాప్ ఆవిష్కరణను వీక్షిస్తున్న ప్రయాణికులు

హన్మకొండ: టీఎస్ ఆర్టీసీ.. ప్రయాణికుల ముంగిటకు మరో సాంకేతిక సహకారాన్ని తీసుకొచ్చింది. ఆర్టీసీ బస్సులకు సంబంధించిన సంపూర్ణ సహకారం అందించే 'గమ్యం వెహికిల్ ట్రాకింగ్' యాప్‌ను తీసుకొచ్చింది. ఈ యాప్‌ను శనివారం హైదరాబాద్ బస్ భవన్ నుంచి ఆర్టీసీ ఎండీ వి.సి.సజ్జనార్ ప్రారంభించారు. ప్రారంభోత్సవాన్ని ప్రయాణికులు వీక్షించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బస్ స్టేషన్‌లో డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ, ఏసీ బస్సులో జీపీఎస్ పరికరాలు బిగించారు. ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్ ఆపై బస్సుల్లో మాత్రమే జీపీఎస్ సమాచారం అందుబాటులోకి వచ్చింది. త్వరలో పల్లె వెలుగు బస్సులకు కూడా ఈ సౌకర్యం విస్తరించేందుకు యాజమాన్యం ఏర్పాటు చేస్తోంది. 'గమ్యం వెహికిల్ ట్రాకింగ్ యాప్'ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి స్మార్ట్ ఫోన్‌లోకి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఈ యాప్ ద్వారా బస్సు ఎక్కడుందో తెలుసుకోవచ్చు. ఈ యాప్‌తో బస్సుల సమయం, ఏఏ బస్సులు ఏ సమయంలో అందుబాటులో ఉన్నాయో, బస్సు ఎక్కడికి వరకు వచ్చింది. బస్ స్టేషన్‌లు, బస్ స్టేజీల సమాచారం తెలుసుకోవచ్చు. ఈ యాప్ ప్రయాణికులకు ఎంతో దోహదపడుతుందని ఆర్టీసీ అధికారులు చెప్పారు.

మహిళల రక్షణకు ప్రాధాన్యం..

మహిళల రక్షణకు యాప్‌లో ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. ప్రధానంగా హైదరాబాద్, సికింద్రాబాద్‌లో బస్ స్టేషన్‌లు, రూట్‌లు తెలియక చాలా మంది ఇబ్బందులు పడుతుంటారు. ఇలాంటి వారి కోసం గమ్యం యాప్‌లో 'ఫ్లాగే బస్సు' అనే ఆప్షన్ కూడా చేర్చారు. యాప్‌లోకి వెళ్లి ఫ్లాగే బస్ అనే చోట నొక్కితే (టచ్ చేస్తే) స్మార్ట్ ఫోన్‌లో ప్రత్యేక కలర్ వస్తుంది. ఈ కలర్‌తో ఉన్న స్మార్ట్ ఫోన్‌ను బస్సు ఎదుటగా చూపిస్తే డ్రైవర్ చూసి బస్సును నిలిపి మహిళలను ఎక్కించుకుంటారు. సమీపంలో ఉన్న బస్ స్టేజీలో దింపుతారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

ఆయిల్ మిల్లులో చోరీ

- రూ.లక్ష అపహరణ


చోరీ జరిగిన తీరును పరిశీలిస్తున్న ఏసీపీ కిషన్

ఖిలా వరంగల్ : వరంగల్ కరీమాబాద్ రోడ్డులోని హరికృష్ణ ట్రేడర్స్, సంధ్య ఆయిల్ మిల్లులో శుక్రవారం అర్ధరాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం వరంగల్ రైల్వేగేట్ ప్రాంతం శాంతినగర్‌కు చెందిన వడ్డె లవన్‌కుకుమార్ కరీమాబాద్ రోడ్డులోని రామలక్ష్మణ్ గార్డెన్ ఎదుట లైన్‌లో హరికృష్ణ ట్రేడర్స్, సంధ్య ఆయిల్ మిల్లును ఏర్పాటు చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజు మాదిరిగానే రాత్రి 10గంటలకు మిల్లు ప్రధాన డోర్‌కు తాళం వేసి ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం గుమస్తాలతోపాటు మిల్లుకు చేరుకున్నాడు. గేట్ ప్రధాన ద్వారం డోర్లు ధ్వంసం చేసి క్యాష్ కౌంటర్ తాళాలు పగుల గొట్టి ఉన్నాయి. చోరీ జరిగిందని గ్రహించిన లవన్‌కుమార్ వెంటనే మిల్స్‌కాలనీ పోలీసులకు సమాచారం అందజేశారు. ఏసీపీ బోనాల కిషన్, ఎస్సై శ్రీలత, క్లూస్ టీమ్ హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకున్నారు. ఈ ఘటనలో రూ.లక్ష చోరీ జరిగిందని బాధితుడు లవన్‌కుమార్ లబోదిబోమన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీలత తెలిపారు.

బిహార్ మహిళల హల్‌చల్..

- వాహనం ఆపి బలవంతంగా చందా వసూళ్లు
- ఇవ్వని వారికి బెదిరింపులు
- సాకరాశికుంట కట్టపై ఘటన


చందా అడుగుతున్న బిహార్ మహిళలు

ఖిలా వరంగల్: వరంగల్‌లో బిహార్ మహిళలు హల్‌చల్ చేస్తున్నారు. చందాలపేరుతో వాహనదారుల నుంచి బలవంత వసూళ్లకు పాల్పడుతున్నారు. లేవంటే ఇక అంతే.. దూర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఈ ఘటన శనివారం ఉదయం వరంగల్ రైల్వేగేట్ ప్రాంతం సాకరాశికుంట కట్టపై జరిగింది. ఐదుగురు మహిళలు ఆటోలో కట్టపైకి చేరుకుని వాహనాలను ఆపి చందాపేరుతో నగదు వసూల్ చేశారు. ఇవ్వని వారిపై బెదిరింపుల పాల్పడ్డారు. స్థానికులు అక్కడి చేరుకుని ప్రశ్నించగానే వచ్చిన ఆటోలోనే వెళ్లిపోయారు. సదురు మహిళలు పంజాబీ, ఫ్యాంట్, షర్ట్ ధరించి ఉన్నారని, చేతిలో కర్రలు ఉన్నాయని స్థానికులు తెలిపారు. ఈ విషయం తెలిసిన వెంటనే మిల్స్‌కాలనీ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. పగలు రహదారులపై చందాలు అడగడం.. రాత్రి వేళల్లో తాళాలు వేసిన ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్నట్లు పలువురు తెలిపారు. వీరిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.